మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట





మక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## పారదర్శకంగా
# కొనుగోళ్లు చేపట్టాలి

**తేమ శాతాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి**

**మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ విజయేంద్ర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 28 ప్రభాతవార్త:** వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న (మక్కలు) కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళవారం సందర్శించారు. మక్కలు ఎండబెట్టుకొని శుభ్రముగా తీసుకువస్తే ప్రభుత్వ మద్దతు ధర లభించునని రైతులకు కలెక్టర్ సూచన చేశారు. అనంతరం అప్పాయిపల్లి గ్రామంలో మెసర్స్ -మిగతా4లో..



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం
# ప్రణాళిక సిద్ధం చేయాలి

**నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణ పేట, అక్టోబరు 28 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కలెక్టరేట్‌లో కమిటీ సభ్యుల తొలి సమావేశం జరిగింది. పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలుకు సంబంధించి వార్షిక ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈ పథకం సహజ మరియు సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించి రైతుల ఆదాయాన్ని పెంపొందించి స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రణాళికకు ముందు జిల్లాలో ప్రస్తుత పరిస్థితులపై బేస్‌లైన్ సర్వే నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ఆ సర్వేలో ఉత్పాదకత తక్కువగా ఉన్న ప్రాంతాల గుర్తింపు -మిగతా4లో..



క్రిటికల్ కేర్ ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వైద్యాధికారులు

## నూతన భవనంలోకి
# డయాలసిస్ విభాగం

**వెంటిలెటర్ సదుపాయాన్ని వేగంగా వాడుకోలోకి తీసుకురావాలి**

**ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీటి నిల్వను పరిశీలించిన కలెక్టర్**

**వనపర్తి, అక్టోబరు 28 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ విభాగాన్ని ఎంసీహెచ్ వెనక నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రం శివారులో ఉన్న మెటర్నటీ చైల్డ్ హాస్పిటల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీటి నిల్వను పరిశీలించిన కలెక్టర్ నిల్వ లేకుండా చేసేందుకు డ్రైనేజ్ కాలువలను నిర్మించి నీరు బయటకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం వెనుక వైపున ఇంకుడు గుంతలను తవ్వించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం సి హెచ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రెజర్ ఆక్సి జన్ ప్లాంట్ విభాగాన్ని -మిగతా4లో..



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

## రూ.10 కోట్లతో ఫూలే,
# అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం

- లక్షల కొద్ది పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం
- ప్రత్యేక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు
- ప్రత్యేక తరగతులు నిర్వహించుట కోసం

**ప్రత్యేక హాల్స్ నిర్మాణం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, అక్టోబరు 28 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ లోని ఆర్అండ్‌బి అతిథి గృహం ప్రాంగణంలో సిడిఎంఎ నిధులు 10కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న ఫూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతంలో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మించేందుకు గత ప్రభుత్వం -మిగతా4లో..

## తుపాను ప్రభావంతో
# రైతులు నష్టపోకుండా చూడాలి : కలెక్టర్




తుఫాన్ ప్రభావంపై ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ , అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ముందా తుపాను ప్రభావం వల్ల రానున్న మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో రైతులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట ధాన్యం వర్షానికి తడిసి నష్టపోకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. తుపాను ప్రభావం గురించి రైతులకు తెలియజేస్తూ, అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. రానున్న మూడు రోజుల పాటు అవసరమైతే వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. వరి ధాన్యం, పత్తి మొక్కజొన్నలు కొనుగోళ్ల నేపథ్యం ధాన్యం తడిసి రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# గోవిందా.. గోవిందా

- ఉద్దాలు ఉత్సవానికి భక్తజన సంద్రం
- పల్లమర్రి నుంచి చాట, వడ్డేమాన్ నుంచి పాదుకల ఊరేగింపు
- బండెనుక బండి కట్టి.. పల్లె జాతరకు పయనం
- స్వామివారి పాదుకులకు ఎమ్మెల్యే, బాలల హక్కుల చైర్మన్ పూజలు
- ఉద్దాలను తాకేందుకు పోటీపడ్డ భక్తజనం
- పచ్చిపులుసు, పరమాన్నంతో స్వామికి నైవేద్యం
- ఉద్దాల ఉత్సవానికి భారీ బందోబస్తు



స్వామివారి ఉద్దాలకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే

**చిన్న చింతకుంట, అక్టోబరు 28 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. స్వామి వారి ఉద్దాల ఉత్సవాన్ని తిలకించేందుకు పల్లె ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో వడ్డేమాన్‌లోని ఉద్దాల మండపం భక్తజన సంద్రంగా మారింది. ఉదయం పల్లమర్రిలోని మేదరులు నియమ నిష్టలతో తయారుచేసిన చాటకు స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో చాట ఊరేగింపు కొనసాగింది. అక్కడ అందంగా అలంకరించిన ట్రాక్టర్ పై చాట నుంచి బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా లాల్‌కోట గ్రామానికి చేరుకుంది. లాల్ కోటలో ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికి కురువడోల్ల చప్పుళ్లతో ఊరేగింపు కొనసాగింది. అనంతరం నెల్లికొండి గ్రామానికి చాట చేరుకోగానే ప్రజలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా వడ్డెమాన్‌లోని ఉద్దాల మండపానికి చేరుకోగానే చాటను ఉద్దాల మండలంలో ఉంచారు. అప్పటికే వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఉద్దాల మండప ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారి పాదుకలను తాకేందుకు భక్తులు క్యూ లైన్‌లో నిలుచుని ఉద్దాలను దర్శించుకున్నారు. అనంతరం చాటలో స్వామివారి పాతుకలను దళితులు మండపం ముందు అరుగుపై ఉంచారు. అప్పటికే స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి దంపతులు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి లలిత శ్రీహరి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, కొత్తకోట సిద్ధార్థ రెడ్డి నేహారెడ్డి మాజీ జడ్పిటిసి వట్టెం రాజేశ్వరి రాము, మాజీ ఎంపీటీసీ వట్టెం స్వప్న శివకుమార్, పాలకమండలి సభ్యులతోపాటు నెల్లి వంశీయులు స్వామివారి పాదుకలు రాగానే నెల్లివంశీయులు తొలి పూజ పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు కమిషన్ చైర్మన్ సీతమ్మ పూజలు నిర్వహించారు. స్వామివారి ఉద్దాల చాటను తలపై ఉంచుకునేందుకు పోటీ పడ్డారు. అక్కడి నుంచి నేరుగా సమీపంలోని ఊకచెట్టు వాగులోకి స్వామివారి పాదుకలను పోలీసుల బందోబస్తు మధ్య తీసుకెళ్లారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులను వరుస క్రమంలో కూర్చోబెట్టి స్వామివారి పాదుకులను వారి తలపై నుంచి తీసుకెళ్తూ స్వామివారి పాదుకలను తాకి భక్తులు పునీతులయ్యారు. అక్కడ వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఊకచెట్టు వాగు లో ఉద్దాల వేడుకలు తిరునాళ్లను తలపించింది. అక్కడి నుంచి దళితులు పోలీసు బందోబస్తు మధ్య అప్పంపల్లి చిల్లబాట నుంచి స్వామివారి పాదుకల ఊరేగింపు కొనసాగింది. తిరుమలాపూర్ గ్రామానికి రాగానే స్వామివారి పాదుకలకు భక్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఊరేగింపుగా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయానికి చేర్చారు. అక్కడ స్వామివారి ఉద్దాలకు ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం అందమైన పూలతో అలంకరించిన ట్రాక్టర్ పై స్వామివారి పాదుకలను ఉంచి ఊరేగింపుగా జాతర మైదానంలోని ఉద్దాల గుండు వద్దకు రాగానే అప్పటికే వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పాటు శివసత్తుల నాట్యాలతో స్వామివారి పాదుకులకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి స్వామి వారి పాదుకల ఊరేగింపు కొనసాగింపులో పోలీసులు నానా అవస్థలు పడ్డారు. నెమలి పించాలతో వచ్చిన శివసతులను అదుపు చేయడంలో పోలీసులు నానా తంటాలు పడ్డారు. భక్తుల గోవింద నామస్మరణతో కురుమూర్తి గిరులు పులకరించాయి. స్వామివారి పాదుకలను కొండ దిగువన జాతర మైదానానికి రాగానే పెద్ద ఎత్తున బాణా సంచాను కాల్చారు. అనంతరం స్వామివారి పాదుకలను ముఖ్య అతిథులు దర్శించుకున్న అనంతరం స్వామి వారి ఉద్దాలను ఉంచిన ట్రాక్టరు మూడు ప్రదక్షిణలు చేసిన తర్వాత స్వామివారి పాదుకలను కొండపై గల స్వామివారి ప్రధానాలయానికి చేర్చారు. అక్కడ ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి పాదు కులను ఉద్దాల మండపానికి చేర్చారు. అనంతరం భక్తులు స్వామివారి పాదుకులను దర్శించుకున్నారు. స్వామివారి ఉద్దాల ఊరేగింపుకు జిల్లా ఎస్పీ జానకి, డిఎస్పి వెంకటేశ్వర్లు, సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ముసురు వర్షం కారణంగా భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు.

**దాసంగాలతో.. స్వామికి మొక్కులు...**

శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవం రోజున స్వామిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పల్లె జాతరకుఇతర రాష్ట్రాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల, పల్లె ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో జాతరమైదానం -మిగతా4లో..



స్వామివారి పాదుకలను తలపై మోస్తున్న ఎమ్మెల్యే



దాసంగాలతో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



పుష్కరిణిలో పుష్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



జాతరలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ

# ఇకపై బాలానగర్‌లో పత్తి విక్రయాలు

**అనుమతి ఇస్తామన్న సీసీఐ చైర్మన్**

**రైతుల సమస్య కు పరిష్కారం**

**ఏళ్ల తరబడిగా తీరని సమస్యను**

**పరిష్కరించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి సీసీఐ చైర్మెన్ కు జ్ఞాపికను అందించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, అక్టోబరు 28 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని, బాలానగర్ మండలానికి చెందిన రైతులు షాద్ నగర్ పత్తి కొనుగోలు కేంద్రంలో తాము పండించిన పత్తిని అమ్ముకోవడానికి అనుమతులు ఇస్తామని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిఎండి లలిత్ కుమార్ గుప్తా హామీ ఇచ్చారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వెల్లడించారు. దీంతో తాము పండించిన పంటను అమ్ముకోవడానికి బాలానగర్ ప్రాంత రైతులు ప్రస్తుతం పడుతున్న ఇబ్బందులు తీరిపోతాయని చెప్పారు. ముంబైలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( సీసీఐ) కార్యాలయంలో మంగళవారం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తాను రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటుగా వెళ్లి కలిశామని, ఈ సందర్భంగా నియోజకవర్గంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఇబ్బందులపై ఆయనతో చర్చించి, వాటి పరిష్కారానికి వినతిపత్రాన్ని అందజేసామని మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి తెలిపారు. బాలానగర్ మండలానికి చెందిన పత్తి రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవడానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జడ్చర్ల పత్తి కొనుగోలు కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. బాలానగర్‌కు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న షాద్‌నగర్ పత్తి కొనుగోలు కేంద్రంలో వారి పంటను అమ్ముకోవడానికి రైతులను అనుమతించకపోవడంతో దూరభారమైనప్పటికీ జడ్చర్ల కు వారు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని లలిత్ కుమార్ గుప్తాకు వివరించగా ఆయన బాలానగర్ పత్తి రైతులు షాద్‌నగర్ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించుకోవడానికి అవసరమైన అనుమతులు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు అనిరుధ్ రెడ్డి వివరించారు. కాగా రాష్ట్రంలో పత్తి పంట సాగు విస్తీర్ణం 45 లక్షల ఎకరాలకు పైగా ఉందని, అయితే ఈ సీజన్‌లో అకాల వర్షాలు, సైక్లోన్ ప్రభావం, పురుగు దాడులు, పెరిగిన ఉత్పత్తి ఖర్చులు రైతులను తీవ్రంగా కుంగదీశాయనీ ఛైర్మెన్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెంటనే జోక్యం చేసుకొని మద్దతు ధరను పెంచడం, ప్రతి పత్తి సాగు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, గత సీజన్ల బకాయిలను తక్షణమే విడుదల చేయడం, పంట నష్టపోయిన రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం, పురుగు నిరోధక విత్తనాలపై పరిశోధన, పంపిణీ బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకోవాలని అనిరుధ్ రెడ్డి లలిత్ కుమార్ గుప్తాకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తక్షణ చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆరు గ్యారంటీలను
# గాలికొదిలేసిన సీఎం

**- సొంత జిల్లాలో పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయలేదు**

**ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**




కరివెన ప్రాజెక్టు వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

**భూత్పూర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** ఎన్నికల ముందు లెక్కలేనన్ని హామీలిచ్చి అధికారం చేపట్టాక సీఎం రేవంత్‌రెడ్డి తన ఆరు గ్యారంటీ లను గాలి కొదిలేశారని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత మొట్టమొదటి సారిగా కవిత పాలమూరు జిల్లా పర్యటనకు వచ్చారు. మంగళవారం ఆమె కరివెన రిజర్వాయర్ పాలమూరు-రంగారెడ్డి శ్రీకురుమూర్తిరాయ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టును ఎమ్మెల్సీ కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లాలో 90శాతం పనులు పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన10శాతం పనులు పూర్తిచేయలేక పోయారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు -మిగతా4లో..

# ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక రవాణా నిర్వహించాలి

- అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు
- ఇసుక తవ్వకం, రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలి..
- ఎక్కడ అవకతవకలు చోటు చేసుకోరాదు
- నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నిబంధనలు వివరిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 28 ప్రభాతవార్త:** జిల్లాలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా చేపిడితే కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో స్థానిక అవసరాల మేరకు ఇసుక వినియోగం పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి గ్రామంలో ఉన్న రెండు ఇసుక రీచ్‌లకు సంబంధించి అధికారులు సమర్పించిన నివేదికలను కలెక్టర్ సవివరంగా పరిశీలించారు. తాడూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీచ్‌లను కొనసాగించాలన్న ప్రతిపాదనలను కూడా ఆయన పరిశీలించారు. ఇసుక రవాణా మరియు నిల్వ విషయంలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత వాహనాలను సీజ్ చేసి వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇసుకను చట్టవిరుద్ధంగా తవ్వడం లేదా రవాణా చేయడంలో పాల్గొనే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసు మరియు మైనింగ్ శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇండ్లు, నిర్మాణ పనులకు ఇసుక కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇసుక సరఫరా సమయానికి జరగడానికి ప్రతి మండలంలో అందుబాటులో ఉన్న రీచ్‌లను సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఇసుక రవాణా పూర్తిగా ఆన్‌లైన్ విధానం ద్వారానే అనుమతించాలనీ, ఎన్ని టిప్పర్లు ఏ ప్రాంతానికి ఇసుకను తరలిస్తున్నాయో వివరాలు స్పష్టంగా నమోదు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా అనుమతులు ఇవ్వడం వలన పారదర్శకత పెరుగుతుందని, అక్రమ రవాణా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. ఇసుక రవాణా వ్యవస్థ నియంత్రణలో ఉండాలని, ప్రజలకు అవసరమైన ఇసుక సులభంగా అందుబాటులో ఉండేలా అధికారులు చూడాలని సూచించారు. ఎక్కడా అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షణ బలపరచాలని, ప్రతి టిప్పర్ కదలికపై సిస్టమ్ ద్వారా పర్యవేక్షణ ఉండాలని ఆయన తెలిపారు. జిల్లాలో ఇసుక వినియోగం పారదర్శకంగా సాగితే అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మురళి, జిల్లా భూగర్భ జల శాఖ అధికారిని దివ్య జ్యోతి, టీజీఎండిసి మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాసాప పాలమూరు
## నగరశాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు

**భూత్పూర్,అక్టోబర్ 28,ప్రభాతవార్త :** జాతీయ సాహిత్య పరిషత్(జాసాప) పాలమూరు నగర శాఖ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఏర్పాటైంది.జాసాప రాష్ట్ర కార్యదర్శి ఉమ్మెంతల మహేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షురాలిగా శాంతారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా ఉపాధ్యాయుడు,జిల్లా కవన వేదిక అధ్యక్షుడు వంచల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతన కమిటీ ఉపాధ్యక్షురాలిగా మక్కాయపల్లి శ్రీదేవి,సహ కార్యదర్శిగా మౌనయ్య,కోశాధికారిగా ఉపాధ్యాయురాలు,కవయిత్రి బండారు సునీతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యుల్ని జాసాప జిల్లా అధ్యక్షుడు ఇరువింటి వెంకటేశ్వర శర్మ,ప్రధాన కార్యదర్శి పుదత్తు కృష్ణమోహన్‌లు పూల మాలలు,శాలువలతో ఘనంగా సత్కరించారు.



జాసాప పాలమూరు నగరశాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న పరిషత్ సభ్యులు

**కుల మతాలకతీతంగా సామాజిక సేవ:** జాసాప విలువలను పెంపొందిస్తూ,సామాజిక రుగ్మతలను నిర్మూలించడానికి కులమతాలకతీతంగా సామాజిక సేవ చేసేందుకు తమ కమిటీ నిరంతరం కృషిచేస్తుందని నూతన అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శాంతారెడ్డి,రవి వంచల అన్నారు.సాహిత్యం ద్వారా సామాజిక అసమానతలు తొలగించేందుకు ఎల్లవేళలా కృషిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ సభ్యులు,జిల్లాసాహితీవేత్తలు పాల్గొన్నారు.

## ఇటిక్యాల మండలంలో 3 కొత్త మద్యం షాపులు

**ఇటిక్యాల అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ప్రభుత్వపరంగా ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వం కొత్తగా మద్యం షాపులను ఏర్పాటు చేస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 13 మండలాలకు 34 మద్యం షాప్ లో ఏర్పాటు కోసం నిర్వాహకుల నుండి దరఖాస్తులను ఆహ్వానించగా 34 షాపులకు గాను 774 మంది దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ మరియు ఆబ్కారీశాఖ అధికారులు. ఇతర శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల సమక్షంలో కొత్త మద్యం షాపులకు లాటరీ పద్ధతిలో షాపులను కేటాయించారు. అందులో భాగంగా ఉమ్మడి ఇటి కాల మండలంలోని ఎర్రవల్లిలో షాప్ నంబర్ 32ను గౌడకులస్తుల రిజర్వు కేటాయించగా ఇటిక్యాల మండలం చాగాపూర్ గ్రామానికి చెందిన మల్లికార్జునగౌడ్‌కు లాటరీ పద్ధతిలో మద్యం షాపు దక్కింది.అలాగే ఎర్రవల్లిలోని షాప్ నెంబర్ 33 మద్యం షాపును జనరల్‌కు కేటాయించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కోడుమూరు మండలం లద్దగిరి గ్రామానికి చెందిన కురువ సుధాకర్ లాటరీ పద్ధతిలో కేటాయించారు. మరియు ఇటిక్యాల మండలంలోని జింకలపల్లి గ్రామంలో షాప్ నంబర్ 31 మద్యం షాపును జనరల్ కు కేటాయించగా నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ తాలూకా ఎల్లూరు గ్రామానికి చెందిన నక్క స్వామికి లాటరీ పద్ధతిలో కేటాయించారు..



లాటరీ పద్ధతిలో మద్యం షాపును కేటాయిస్తున్న జిల్లా కలెక్టర్

## రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

**ఆత్మకూర్ మార్కెట్ ఛైర్మన్ రహిమతుల్లా**

**అమరచింత అక్టోబర్ 28,ప్రభాతవార్త:** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆత్మకూరు మార్కెట్ చైర్మన్, రహమతుల్లా, ఆత్మకూర్ సింగిల్ విండో అధ్యక్షులు, గాడి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ప్రభుత్వ ద్యేయంగా ముందుకు సాగుతుందని వారు అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అకాల వర్షాల వల్ల వరి ధాన్యం తడిసిన ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్య పడకుండా ఉండాలని వారు రైతులను కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుసంక్షేమం కోసం 2లక్షల రుణమాఫీ చేసి రైతుల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.అలాగే రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి. పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి,కేశం నాగరాజ్‌గౌడ్ ఆదేశాలమేరకు మండలంలోని వరి ధాన్యకేంద్రాలు ప్రారంభించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, అమరచింత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరుణ్ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్లు చుక్క వెంకట్ రెడ్డి, తమ్మిరెడ్డి, ఆత్మకూరు మార్కెట్ డైరెక్టర్లు విష్ణు, శ్రీనివాస్ రెడ్డి, గణేష్ గౌడ్, పి ఎ సి ఎస్ అధికారులు నరేష్, ఉదయ్, ఏఈఓ. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిమల్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## మహబూబ్‌గర్ జిల్లా క్లబ్ అధ్యక్షుడికి ఘన సన్మానం

**మహబూబ్‌నగర్, అక్టోబరు 28 ప్రభాతవార్త:** ఇటీవల జిల్లా క్లబ్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగేశ్వర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ తరపున మంగళవారం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సౌమ్యుడు వివాహ రహితుడిగా పేరు పొందిన నాయకుడు నాగేశ్వర్ రెడ్డిని కొనియాడారు. వారికి క్లబ్ అధ్యక్షులుగా అవకాశం రావడం సంతోషకరమని కొనియాడారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని మరింత గుర్తింపు తీసుకు వస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు జి.పద్మజా రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు కె.రాములు, పాండురంగారెడ్డి అచ్చుగట్ల అంజయ్య, కె.సతీష్ కుమార్, సంపత్ కుమార్, శివకుమార్, తిరుపతి రెడ్డి, శ్రీశైలం యాదవ్, దోమ లక్ష్మీనారాయణ, కరుణాకర్ రెడ్డి, జయశ్రీ, వేణమ్మ, వెంకటేశ్వరమ్మ, బాల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న పద్మజా రెడ్డి, నాయకులు

## ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ

**ఉప్పునుంతల, అక్టోబరు 28 ప్రభాతవార్త :** పాఠశాల విద్యా సంచాలకులు, సమగ్ర శిక్షా తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు 2025లో నూతనంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు గతంలో నిర్వహించిన సమ్మర్ శిక్షణల్లో పాల్గొనని ఉపాధ్యాయుల కోసం రెండు రోజుల పాటు ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం రేపటి 30 నుంచి నవంబర్ 4 వరకు రెండు విడతలుగా నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. అక్టోబర్ 30,31 తేదీల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందిన, స్కూల్ అసిస్టెంట్లుగా గణితము ఫిజికల్ సైన్స్ బయోసైన్స్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ, నవంబర్ 3, 4 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు తెలుగు, హిందీలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఉపాధ్యాయులకు సూచించిన స్థలాల్లో ఈ కార్యక్రమం జరగనున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

## తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తి కొనాలి

**నారాయణపేట,అక్టోబరు 28 ప్రభాతవార్త :**నారాయణ పేట జిల్లాలో పత్తి రైతులు వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా తెలిపారు. పత్తి ఆరబెట్టిన తర్వాత అనుకోకుండా వర్షాలు పడటంతో తేమశాతం 12కంటే ఎక్కువగా వస్తోందని పేర్కొన్నారు.ఈనేపథ్యంలో తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సీసీఐ అధికారులు తేమ శాతం ఎక్కువగా ఉందని పత్తి ట్రాక్టర్లను వెనక్కి పంపడం రైతులపై అన్యాయం చేస్తున్న చర్య అని అన్నారు. పత్తి స్లాట్ బుకింగ్ రద్దు అవ్వడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మూడు సార్లు ట్రై చేస్తే బ్లాక్ అవుతుందనే భయంతో ఉన్నారని వివరించారు. వర్షాలు చలి కారణంగా పత్తిపై టార్పాలిన్ కప్పినా తేమ తగ్గడం లేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఎమ్మెల్యేలు మంత్రులు కలసి రైతులకు అండగా ఉండాలని కోరారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన పత్తిని తిరస్కరించకుండా తేమ శాతం కొంచెం ఎక్కువ ఉన్నా కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సంవత్సరం వర్షాల కారణంగా పత్తి వరి దిగుబడులు తగ్గి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు భవిష్యత్తులో రక్షణగా వాతావరణ బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ అంశాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదల నివారణకు విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీలు

**గద్వాల టౌన్ , అక్టోబర్ 28, ప్రభాతవార్త:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకి విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీల ఏర్పాటు చెయ్యాలని,ప్రతి స్టేషన్‌హౌస్ ఆఫీసర్ కూడా పిటిషన్ ఎంక్వైరీలో భాగంగా గ్రామాలకు వెళ్లాలని జిల్లాఎస్పీ టి.శ్రీనివాస రావు పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో నిబద్ధతను కలిగి ఉండాలని, పక్షపాతం లేకుండా సమానత్వం పాటించాలని, బాధితులందరినీ ఒకేవిధంగా చూడాలని అందరికీ న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి, వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు.ఈ నెలలో నమోదైన కేసుల వివరాలపై పోలీస్ స్టేషన్‌ల వారీగా ఆరా తీసి, కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రతి కేసులోనూ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ఫైల్ అప్డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు లేదా వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలి అని ఆదేశించారు. పాత కేసుల దర్యాప్తులో పురోగతిని పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేల చూడాలన్నారు.అదే విధంగా కోర్టులో ట్రయల్ లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి, ప్రతి కేసులోను తప్పనిసరిగా సాక్షులకు, ముద్దాయిలకు సమన్లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కోర్టు కానిస్టేబుల్ లు విధులు నిర్వహించాలన్నారు.అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలలో అవగాహన తీసుకొని వచ్చి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచనలు చేశారు.రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేలా ఎన్ హెచ్ 44 ను కవర్ చేస్తున్న పోలీస్ స్టేషన్ లు అన్ని విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.మహిళలపై జరిగే నేరాలలో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు. యువత ఆన్లైన్ బెట్టింగ్ వలలో పడి మోసపోకుండా పోలీస్ స్టేషన్ ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా ఆన్లైన్ బెట్టింగ్ ని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.యువత, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ నేరాలపై ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధి లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ డీఎస్పీ. మొగిలయ్య, ఎస్.బి ఇన్స్పెక్టర్ రవి, సిఐ గద్వాల్ శ్రీను , సిఐ అలంపూర్ రవి బాబు, సిఐ శాంతినగర్ టాటా బాబు, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, డిసిఆర్బి ఎస్సై బి. స్వాతి, ఐటీ కోర్ ఎస్సై సుకుర్, డిసిఆర్బి, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస రావు

## భవిష్యత్తులో రైతుల ఆర్థిక వనరులకు ఆయిల్ ఫామ్ పంట సాగు

**అయిజ అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ప్రస్తుతం ఏ పంట సాగు చేసినా రైతుకు పెట్టుబడి భారంఅవుతున్నదని భవిష్యత్తులో ఆయిల్ ఫామ్ సాగు ఆదాయపు వనరు అని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి అక్బర్ అన్నారు.మంగళవారం జిల్లా సహకార శాఖ అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ ఆయిల్ ఫెడ్ సౌజన్యంతో పట్టణంలోని రైతువేదిక లో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు జరిగింది.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డిఅధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా హార్టికల్చర్ అధికారి అక్బర్ మాట్లాడుతూ, రైతులకు వ్యవసాయమే పెద్ద గుదిబండ అవుతున్న తరుణంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిచారించాయన్నారు. ఈ పంట సాగు వల్ల క్రిమిసంహారక మందుల వినియోగం 90 శాతం పైనే తగ్గిపోతుందని, దాంతో వాతావరణ కాలుష్యం భూసారం తగ్గిపోవడం వంటి అనేక అవరోధాలు తొలగిపోతాయన్నారు. జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో పామ్ ఆయిల్ దిగుమతి కోసం ఏటా 70 వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని (ఫారిన్ ఎక్స్చేంజ్) ప్రభుత్వం వెచ్చిస్తుందని, ఆ ఖర్చును ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు పెద్ద ఎత్తున రైతులకు సబ్సిడీ అందిస్తే, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లబ్ధి పొందే అవకాశాలు ఉన్నాయనే ఉద్దేశంతో రైతులను ఆ దిశగా కార్యోన్ముఖులను చేస్తుందన్నారు. సహకార సంఘాల ద్వారానే రైతుల సమీకరణ, మంచి కార్యాచరణ ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం పాక్స్ ల ద్వారా ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీజీ ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ శివనాగిరెడ్డి ఆర్టికల్చర్ ఆఫీసర్లు మహేష్,రాజశేఖర్ మండల వ్యవసాయ అధికారి జనార్ధన్, ఫీల్డ్ ఆఫీసర్లు అశోక్ రెడ్డి, మంజునాథ్,మేఘ రెడ్డి, శివకుమార్,శశిధర్ సింగిల్ విండో కార్యదర్శి మల్లేష్, సిబ్బంది జీవన్, శ్రీనివాస్,మహేష్.. వివిధ గ్రామాల నుంచి 200 మంది రైతులు పాల్గొన్నారు.



సదస్సు లో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి అక్బర్

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్సై నరేందర్

**ఆత్మకూర్ అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో విద్యార్థిని విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆత్మకూర్ ఎస్సై నరేందర్ విద్యార్థులకు సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రోజు పట్టణంలోని అక్షర టెక్నో స్కూల్ పాఠశాల చెందిన విద్యార్థిని విద్యార్థులకు ఆత్మకూరు ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు ఎక్కువగా ఆన్లైన్ గేమ్లకు అలవాటు పడడమే కాకుండా జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అలా కాకుండా విద్యార్థినీ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండి లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకుంటేనే భవిష్యత్తు సుఖవంతంగా ఉంటుందని ఆయన సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలలో విద్యార్థిని విద్యార్థులతో పాటుగా పలువురికి ట్రాఫిక్ నిబంధనలు మరియు సైబర్ క్రైమ్ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతం చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు.విద్యార్థిని విద్యార్థులు ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సందర్శించి పలు విషయాలు తెలుసుకోవడంతో తమకు ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థులు ప్రధాతవార్తకు వెల్లడించారు ఈ కార్యక్రమంలో ఆత్మకు నరేంద్ర తో పాటుగా పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.



విద్యార్థినీ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేందర్

## నోవెల్‌టెక్ కార్మికులు,ఉద్యోగులను ఆదుకోవాలి

**- కాంగ్రెస్, బీజేపీ నాయకుల డిమాండ్ - కంపెనీ ముందు ఉద్యోగులు చేపట్టిన ధర్నాకు మద్దతు**

**భూత్పూర్,అక్టోబర్ 28,ప్రభాతవార్త :** ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా తమ కంపెనీని అర్థాంతరంగా మూసివేసి ఉద్యోగులు, కార్మికులను రొడ్డున పడేసిన నోవెల్‌టెక్ ఫీడ్ కంపెనీ యాజమాన్యం కంపెనీ కార్మికులు,ఉద్యోగులను ఆదుకోవాలని,ఉద్యోగులకు న్యాయం జరిగేవరకు తాము వారికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని భూత్పూర్ బీజేపీ నాయకుడు కెంద్యాల శ్రీనివాస్(ఐదిండ్ల శ్రీను), పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ పేర్కొన్నారు.తమ చేత కంపెనీ యాజమాన్యం బలవంతంగా సంతకాలు చేయించుకుని కంపెనీని అర్థాంతరంగా మూసివేసి తమను రొడ్డు పాల్జేశారని కంపెనీ ఉద్యోగులు దాదాపు వంద మంది మంగళవారం భూత్పూర్ పట్టణ పరిధిలోని సారిక టౌన్‌షిప్‌కు ఎదురు గా ఉన్న నోవెల్‌టెక్ కంపెనీ ముందు చేపట్టిన ధర్నాకు బీజేపీ, కాంగ్రెస్ తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ ఉద్యోగుల ధర్నాలో పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ ఉద్యోగుల చేత బలంతంగా సంతకాలు చేయించుకుని, నామమాత్రంగా మూడు నెలల జీతాలు చెల్లించి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఇవ్వకుండా కంపెనీ యాజమాన్యం మోసం చేసిందని కెంద్యాల శ్రీనివాస్, లిక్కి నవీన్‌గౌడ్‌లు విమర్శించారు.ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లకు తాము పూర్తిగా సంఘీభావంతెల్పుతూ, వారి డిమాండ్ల సాధనకు తమ వంతు కృషిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఊరడి మహానంది, ఊరడి వెంకటేష్,కృష్ణయ్యలతో పాటు కాంగ్రెస్ నాయకులు కెంద్యాల నరేందర్,మట్టి ఆనంద్,మల్లేష్,దుప్పల్లి రవితేజ,బత్తుల మల్లిఖార్జున్,బుడ్డ చిన్నయ్యగారి నర్సింహులు,ఎండి మన్నాన్,గడ్డం ఎర్రన్న పాల్గొన్నారు.



ఉద్యోగులు చేపట్టిన ధర్నాలో పాల్గొన్న కెంద్యాల శ్రీను,లిక్కి నవీన్

## కొల్లాపూర్ నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ

**వీపనగండ్ల అక్టోబర్ 28, ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గంలోని రోడ్లకు మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో రోడ్లకు మహర్దశ ఏర్పడింది దాదాపుగా 200 కోట్ల తో నిర్మాణం కానున్న బీటీ రోడ్లు నిర్మాణం కోసం నిర్మాణం కోసం నిధులు విడుదల అయినట్లు ప్రభుత్వం నుంచి ప్రొసిడింగ్ రావడం జరిగింది. ఈనెల 18వ తేదీన మంజూరు వివిధ రోడ్లకు సంబంధించి కావడం జరిగింది. అందులో భాగంగా వీపనగండ్ల మండల కేంద్రం నుండి వయా కల్వరాల్ల కేతపల్లి వరకు 11/1 కిలోమీటర్లు 30.01 కోట్లు తో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కావడం జరిగింది. అదే విధంగా31.83 కోట్లతో 21.66 కిలోమీటర్లు పెంట్లవెల్లి నుండి శ్రీరంగాపూర్ వరకు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు జరిగినట్లు వీపనగండ్ల మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్ రవీందర్ రెడ్డి మహేష్ యాదవ్ భరత్ రెడ్డి మునికొండ గోపి సంగినేనిపల్లి మాజీ ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేష్ తదితరులు తెలిపారుల నిర్మాణానికి టెండర్లు త్వరలో పిలువనున్నట్లు వారు తెలిపారు. ఈ నిధులు మంజూరు చేసినటువంటి ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## స్వయం ఉపాధి
## వ్యాపారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల టౌన్ ,అక్టోబర్ 28,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మైనారిటీల స్వయం ఉపాధి వ్యాపారాల కొరకు "ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన" మరియు "రేవంతన్నా కా సహారా మిస్కీన్‌ల కోసం రెండు కొత్త పథకాలను ప్రారంభించబడ్డాయని, ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారులు తమదరఖాస్తులను నవంబర్ 5వతేదీ వరకు జిల్లామైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరములకు 70130325 67 నెంబర్ను సంప్రదించవలసిందిగా వారు తెలిపారు.

## కురుమూర్తి రాయుడి
## ఉద్దాలను దర్శించుకున్న సరోజ్‌రెడ్డి

**భూత్పూర్,అక్టోబర్ 28,ప్రభాతవార్త :** పాలమూరు పేదల తిరుపతిగా పేరొందిన శ్రీకురుమూర్తిరాయడి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.మంగళవారం స్వామివారి ఉద్దాల మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.ఈ ఉద్దాలను బీఆర్ఎస్ నేత మందడి సరోజర్‌రెడ్డి దర్శించుకుని,స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## జిల్లా కలెక్టర్‌కు జన్మదిన
## శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 28 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు ఎమ్మెల్సీ కూచు కుళ్ళ దామోదర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ సేవాభావం,పరిపాలన శైలి ప్రశంసనీయం కొనియాడారు.విద్యా,వైద్యరంగాల్లో కలెక్టర్ కృషి ఎనలేనిదని అభినందించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల వేగ వంతానికి కలెక్టర్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. పేదల కోసం ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కలెక్టర్ సతీమణి పల్లవి, కుమారుడు రుగ్వేద్ సమక్షంలో కేక్ కట్ కార్యక్రమం ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డితో పాటు, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం ఆధ్వర్యంలో అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ

## కల్లు ఈత వనాలను నాశనం
## చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**సుమారు 45 చెట్ల కల్లు లొట్లు ధ్వంసం**

**పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామంలో ఘటన**

**పెబ్బేరు, అక్టోబరు 28 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని పాతపల్లి గ్రామంలో గీత కార్మికులు వృత్తి జీవనాధారంగా తమ జీవితాలను కొనసాగిస్తున్న తరుణంలో గ్రామానికి చెందిన కొందరు గౌడ కులస్తులపై పడి రాక ఈత వనంలో చెట్లపై, చెట్లకు కట్టిన కల్లులొట్లను సోమవారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.ఈ విధంగా చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకొని గౌడ కుల వృత్తిదారులకు న్యాయం చేయాలని పాతపల్లి గ్రామ గౌడ కులస్తులు సంబంధిత పోలీసు,ఎక్సైజ్ శాఖ అధికారులను కోరారు. ఈ దాడికి పాల్పడిన వారిపై పోలీసు, ఎక్సైజ్ శాఖ చట్టపరంగా చర్యలు తీసుకోనట్లయితే రాష్ట్ర పరిధిలో జిల్లా, మండల, గ్రామాల పరిధిలలో గీతా కార్మికుల మమేకమై నిరసనలు తెలుపుటకు వెనకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తగిన శిక్ష విధించాలని పాతపల్లి గ్రామ గౌడ కులస్తులు ప్రాధేయ పడుతున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం

**ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు పథకాలు.. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సరిత తిరుపతయ్య..**

**ఇటిక్యాల అక్టోబర్ 28, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని మహిళలకు సంక్షేమ పథకాలు అందించి అలాగే స్వయం ఉపాధి కల్పిస్తూ వారిని లక్షాధికారులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య అన్నారు. మంగళవారం మానవపాడు మండ్లల అమరవాయి గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మహమ్మద్ సిరాజ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సరిత తిరుపతయ్య మాట్లాడుతూ... మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పాన్ని గుర్తు చేస్తూ మహిళల కోసం వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం 500 కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందనన్నారు. అంతేకాక మహిళలకు .పెట్రోల్ బంకుల నిర్వహణ, సోలార్ సిస్టం. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ కంపెనీలు, ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపు వంటి వ్యాపారాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందనన్నారు. మరియు ఇందిరమ్మ ఇండ్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని మంజూరు అయినట్లు తెలిపారు. ఇల్లు కట్టుకొనే స్థితిలో లేని పేదలకు మహిళా సంఘాల ద్వారా 1 లక్ష రూపాయల రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాకాలను మహిళలు అంతా అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా ఒక్కో మహిళా సంఘం ప్రతినెల 70 వేల రూపాయలను సంపాదిస్తున్నట్లు, పెట్రోల్ బంకుల ద్వారా ప్రతినెల 4 నుంచి 5 లక్షల వరకు ఆదాయం మహిళా సంఘాలకు వస్తున్నట్లు వివరించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సరిత తిరుపతయ్యను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహమ్మద్ సిరాజ్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దివాకర్ గౌడ్, హుస్సేన్ పీర్ , కురువ మోహన్, సిరాజ్ ,గాండ్ల రమేష్ ,అబ్దుల్ రహమాన్,ఖాజా హుస్సేన్,ప్రవీణ్ , లాలు,సిరాజ్,తేజగౌడు,రాధాకృష్ణగౌడ్,అలిపిర్,రాముడు ,మద్దిలేటి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.



కాంగ్రెస్ పార్టీ నాయకులతో
ఇన్చార్జి మాజీ జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

## మర్రికుంట చెరువు అలుగు సమస్యను పరిష్కరించండి

**వనపర్తి, అక్టోబరు 28 ప్రభాతవార్త:** మర్రికుంట చెరువు అలుగునీటి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన బిజెపినాయకులు మంగళవారం బిజెపిజిల్లా అధ్యక్షులు డి. నారాయణ ఆధ్వర్యంలో మర్రికుంట చెరువు అలుగునీటి సమస్య వల్ల పెబ్బేరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం పరిసర కాలనీల ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ మాట్లాడుతూ చెరువు అలుగు నీరు వర్షపు నీరు పశ్చిమ వైపు వెళ్లేలా గతంలోనే రోడ్డు ఆనకట్ట నిర్మించబడినా ఈ మధ్యకాలంలో పాత ఆనకట్ట నుండి 400 అడుగుల దూరంలో ఎగువ వైపు కల్వర్టు నిర్మాణం చేస్తుండగా బిజెపి పార్టీ తరఫున తప్పుడు నిర్మాణంపై బిజెపి పార్టీ అభ్యంతర వ్యక్తం చేయగా గత కలెక్టర్ కొంత సమయానికి ఆపివేయడం జరిగిందని అనంతరం అధికార పార్టీ ఒక నాయకుడి స్వార్థం కొరకు నిర్మాణం చేశారని ప్రస్తుతం ఆ కల్వర్టు నిష్ప్రయోజనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు కురిసిన రెండు పర్యాయాలు బిజెపి నాయకులు పర్యటించి వర్షంతో చెరువు కింద రోడ్డుపైన మూడు నాలుగు మీటర్ల ఎత్తులో నీరు ప్రవహించడం వల్ల రోడ్డుకు ఇరువైపులా భారీ భవంతులు వాణిజ్య సముదాయాల నిర్మాణాల వల్లనీరు వెళ్లడానికి సరైన కాలువలు లేకపోవడంతో పెబ్బేరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం చుట్టుపక్కల ఇళ్లల్లోకి నీరు చేరడం భారీ వరద నీరు వల్ల వాహనాలు మునిగిపోవడం తదితర విషయాలను పత్రిక ముఖంగా, సోమవారం ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్అండ్‌బి, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సమగ్ర సర్వే నిర్వహించి అలుగునీటి పారడానికి అనువైన ప్రదేశాన్ని గుర్తించి నూతన కల్వర్టు కాలువల నిర్మాణం ద్వారాష్ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. వినతి పత్రం అందజేసిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు న్యాయవాది మున్నూరు రవీందర్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు అరవింద్, నవీన్, కోశాధికారి శ్రీకాంత్, కార్యదర్శి కడమంచి శివ, పట్టణ అధ్యక్షులు ఆగపోగు చాణక్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓలకు ఘన సన్మానం



ఎంపిడిఓలను సన్మానిస్తున్న దృశ్యం

**మద్దూర్, అక్టోబరు28 ప్రభాతవార్త:** మద్దూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో నూతనంగా వచ్చిన మద్దూరు మండల పరిషత్ కాలయం నందు మద్దూర్ వి.శ్రీధర్, కోస్గి క్రాంతి ఎంపీడీఓలకు అలాగే మద్దూరు నుండి బదిలీపై వెళ్తున్న రహమతొద్దిన్ ఎంపీడీఓలకు మండల పరిషత్ అధికారులు మరియు వివిధ గ్రామాల కార్యదర్శులు అలాగే ఎన్ఆర్ఇజిఎస్ శాఖ అధికారులు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.శ్రీధర్ మాట్లాడుతూ సన్మాన కార్యక్రమం నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు తమకు ఇచ్చిన విధుల పట్ల శ్రద్ధగా వ్యవహరించాలని తెలిపారు. మద్దూరు మండల కేంద్రంలో గతంలో ఇన్చార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహించినట్టు గుర్తు చేసుకున్నారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ తమ ఉద్యోగానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండుమల్ ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, కొత్తపల్లి ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీఓ రామన్న, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు భవాని శంకర్, వివిధ గ్రామాల కార్యదర్శులు బాలరాజు, వెంకటేష్, షాజిల్, రాజు, గంగమ్మ, మద్దూరు పట్టణ యువకులు నరసింహులు, ఎన్ఆర్ఇజిఎస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 30న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి



బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, అక్టోబరు28 ప్రభాతవార్త:** ప్రభుత్వం బకాయిపడిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల మొత్తాన్ని విడుదల చేయాలని అక్టోబరు 30న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ పిలుపు ఇచ్చిన బందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను దామరగిద్ద మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విడుదల చేయడం జరిగింది. ఈ బంద్ రాష్ట్రంలోని డిగ్రీ,ఇంజనీరింగ్, పీజీ,ఒకేషనల్ కళాశాలలు, యూనివర్సిటీలకు వర్తిస్తుందన్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాల యాజమాన్యాలు సహకరించాలని, విద్యార్థులు బందులో అధిక సంఖ్యలోపాల్గొనిజయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలోదామరగిద్ద మండల కార్యదర్శి మహేష్‌యాదవ్, జిల్లా కమిటీ మెంబర్ వెంకటేష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు తక్షణమే మూసివేయాలి

**ఊట్కూర్, అక్టోబరు 28 ప్రభాతవార్త :** గీత వృత్తిని దెబ్బతీస్తున్న బెల్ట్‌షాపులను తక్షణమే మూసివేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బిజ్వార్ మహేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళ వారం బిజ్వార్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ సన్నిధిలో నిర్వహించిన కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదాయం కోసం జిల్లా బెల్ట్ షాపులను ప్రోత్సహించడం వల్ల వేలాది గీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. అలాగే ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి వికలాంగులైన వారికి బకాయిలను చెల్లించాల ని, గీత కార్మికుల కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు బీసీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పూజారి నారాయణగౌడ్, నరసింహాగౌడ్ తదితరులు ఉన్నారు.

## దేవరకద్ర మండలం సగర సంఘం ఎన్నిక

**దేవరకద్ర, అక్టోబరు 28 ప్రభాతవార్త:** జిల్లా సగర సంఘం అధ్యక్షులు ప్రదీప్ చందర్ ఆధ్వర్యంలో దేవరకద్ర మండల కేంద్రంలోని సత్యం సగర నివాస ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండల సగర సంఘం అధ్యక్షులుగా సక్కెరి రామాంజనేయులు,ప్రధాన కార్యదర్శిగా గుంటి చిన్న రాములు, కోశాధికారిగా ఆది నారాయణ లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తూ సగరజాతి ఐక్యత కోసం, సగరుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని, గ్రామాలలో సగర సంగం బలోపేతం చేస్తామని, ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సగర సంఘం మాజీ అధ్యక్షులు బంగారు నరసింహ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుద్ధన్న సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవన్న సాగర్, రాష్ట్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి సవారి సత్యం సాగర్, మహబూబ్‌నగర్ జిల్లా సగర సంగం అధ్యక్షులు ప్రదీప్ చందు సాగర్, బుదురు శేఖర్, గదిగూడెం నారాయణ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



సగర సంఘం సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

# అవినీతి నిర్మూలన లక్ష్యంగా పారదర్శక పాలన

- ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజలకు నిబద్ధతతో సేవలందించాలి
- విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నవంబరు 2వ తేదీ వరకు నిర్వహించాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- అవినీతి రహిత సమాజం కోసం కలెక్టర్ పిలుపు



విజిలెన్స్ అవగాహన వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్28 ప్రభాతవార్త:** అవినీతికి తావు లేకుండా పారదర్శకతతో కూడిన సమర్థ పాలనే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, ప్రజలకు చేరువై ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి నీతినిజాయితీగా ఉంటూ, ప్రజలకుపారదర్శకత జవాబుదారీతనంతో ఉండాలని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్ జిల్లా అధికారులు, కార్యాలయాల సిబ్బందికి ప్రధాన సమావేశ మందిరంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకొని సత్యనిష్ఠ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ సమగ్రత, అవినీతి నిర్మూలన, లంచం ఇవ్వచూపడం, తీసుకోవడం నేరం వంటి అంశాలపై అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి నవంబరు 2వ తేదీ వరకు కల్చర్ ఆఫ్ ఇంటెగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పర్టీఅనే థీమ్‌తో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పబ్లిక్‌లో అవినీతి నిర్మూలనపై క్విజ్ పోటీలు, వాక్‌థాన్‌లు, మారథాన్‌లు, వీధి నాటకాలు, గ్రామసభలు నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమగ్రత, పారదర్శకత జవాబుదారీతనాన్ని విధిగా విధుల్లో అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ ప్రజలకు మరింత చేరువై ప్రజల నమ్మకాన్ని మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన పనిలో నిజాయితీగా ఉంటూ, ప్రజలకు నిస్వార్థ సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టరు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అవినీతిని నిరోధించడంలో పౌరులందరూ భాగస్వాములు కావాలని ప్రోత్సహించడం, సమగ్రత, పారదర్శకత మరియు జవాబుదారీతనం యొక్క సంస్కృతిని బలోపేతం చేయడం దీని ప్రధాన లక్ష్యంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అక్టోబర్ 27వ తేదీ నుండి నవంబర్ 2వ తేదీ వరకు నిర్వహించే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్, విజిలెన్స్ అధికారులు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఏ.సురేందర్ రెడ్డి, కే.విజయ్‌కుమార్, ఏడి అగ్రికల్చర్,కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ అవినాష్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మధుమేహం వ్యాధిగ్రస్తులకు

# రెటినోపతి వైద్య పరీక్షలు నిర్వహించాలి

**వనపర్తి జిల్లాలో ఏ ఒక్కరూ రెటినోపతి బారిన పడకుండా జాగ్రత్తలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ సురబి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన వైద్య అధికారులు

**వనపర్తి, అక్టోబరు 28 ప్రభాతవార్త:** జిల్లాలోని మధుమేహం వ్యాధిగ్రస్తులకు రేటినో స్కోపి అత్యాధునిక సాంకేతిక పరికరం (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహాయంతో ముందుగానే రెటినోపతి వ్యాధిని గుర్తించి నివారణ చర్యలకు వంద రోజులు ప్రణాళికలు చేపట్టాల్సిందిగా ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురబి, రెటినోపతి అనే వ్యాధి మధుమేహం వ్యాధిగ్రస్తులకు సోకి క్రమంగా అందత్వం వచ్చే ప్రమాదం ఉంటుందని అందువల్ల ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్యము చేయడం ద్వారా నివారించవచ్చని అందుకు మెడికల్ కళాశాల ఆప్తాలమాలజీ డిపార్ట్మెంట్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా 100 రోజుల స్క్రీనింగ్ ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ కళాశాల ఆప్తామాలజి డిపార్ట్మెంట్ ఇన్చార్జితో రెటినోపతి వ్యాధి నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు రెటినోస్కోపీ అనే అత్యాధునిక సాంకేతిక పరికరాన్ని వనపర్తి జిల్లాకు అవసరమైన మేరకు కొనుగోలు చేసి నవంబర్ 14 నుండి 100రోజులపాటు పి.హెచ్.సి వారిగా గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారంఇంటింటికి తిరిగి మధుమేహం వ్యాధిగ్రస్తులకు రెటినోపతి వైద్య పరీక్షలు నిర్వహించాలని అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. గత సంవత్సరంలో జిల్లాలోని ఇంటింటికి వెళ్లి 30 సంవత్సరాల వయస్సు పైబడిన వారందరికీ మధుమేహం వైద్య పరీక్షలు నిర్వహించి దాదాపు 20,000 మంది మధుమేహం వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరిగిందని, వారందరికీ ఒక షెడ్యూల్ ప్రకారం గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఇందులో పాజిటివ్ వచ్చినవారికి గుర్తించి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించాలని అవసరమైన వారికి సరోజినీ హాస్పిటల్ లేదా ఎల్వీ ప్రసాద్,పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్‌కు సిఫారసు చేయాలని సూచించారు. ఇందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసి వనపర్తి జిల్లాలో ఏ ఒక్కరూ రెటినోపతి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. జిల్లా మెడికల్ కళాశాల ఆప్తల్ మాలజీ విభాగము మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖఎన్సీడీ ప్రోగ్రాం అధికారి సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఈ వంద రోజుల వైద్యపరీక్షల కార్యాచరణ ప్రక్రియప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.శ్రీనివాసులు ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.రామచంద్రరావు, నోడల్ అధికారి డాక్టర్ రియాశ్రీ, ఆప్తాలమాలజీ హెచ్.ఓ.డి డా. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా కోసం లైన్ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్,పాల్గొన్న విద్యుత్ అధికారులు

**వనపర్తి, అక్టోబరు28 ప్రభాతవార్త:** వనపర్తి మండలం పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా కోసం లైన్ ఏర్పాటు చేసేందుకు త్వరతగతిన పనులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్లో పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా లైన్ ఏర్పాటు విషయంపై డీఎఫ్ఓ అరవింద్ ప్రసాద్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి మండలం పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా కోసం లైన్ ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే స్థలం గురించి అధికారులు చేసిన సర్వే నివేదికను పరిశీలించారు. ఇందుకోసం మొత్తం 1526 మీటర్ల అటవీ భూమి అవసరం పడుతుందని సర్వే నివేదికలో పేర్కొనగా, ఇందుకు కమిటీ ఆమోదం తెలిపింది అని చెప్పారు. ఇక విద్యుత్ లైన్ వేసేందుకు కమిటీ నుంచి లైన్ క్లియర్ అయినట్లు చెప్పారు. ఇక వెంటనే పెద్దగూడెం తండాకు విద్యుత్ సరఫరా కోసం లైన్ ఏర్పాటు చేసేందుకు త్వరతగతిన పనులు ప్రారంభించాలని సూచించారు. అయితే లైను ఏర్పాటు చేసే సమయంలో విద్యుత్ అధికారులు అవసరం మేరకే ఒక పద్ధతి ప్రకారం కొమ్మలను తొలగించాలని కలెక్టర్ సూచించారు. కొమ్మలను తొలగించే ముందు అటవీ అధికారులకు సమాచారం అందించాలని తెలియజేశారు. అదేవిధంగా, వనపర్తి మండలం పరిధిలోని సవాయిగూడెం గ్రామ చెరువుకు నీటి సరఫరా చేసేందుకు కాలువ నిర్మాణం గురించి నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ ఆరా తీశారు. ఇందుకోసం కావాల్సిన అటవీస్థలం గురించి పర్వేష్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వెంటనే సవాయిగూడెం చెరువుకు నీరు అందించేందుకు కాల్వ నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా గ్రామంలో పంట అవసరాలకు సాగునీటిని అందించడం సులభతరం అవుతుందని తెలియజేశారు. సమావేశంలో డిఆర్‌డిఓ ఉమాదేవి, నీటిపారుదల శాఖ అధికారి మధు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, విద్యుత్ శాఖ ఎస్ఈ రాజశేఖర్,ఇసెక్షన్ సూపర్డెంట్ సునీత, జిల్లా పంచాయతీ అధికారి రఘునాథ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహానికి సహకరించే వారిపై కేసు నమోదు చేయాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్,ఎస్పీ,హాజరైన జిల్లా అధికారులు

**వనపర్తి, అక్టోబరు 28 ప్రభాతవార్త:** పిల్లల తల్లిదండ్రులతో పాటు పెళ్లి కుదిర్చిన పెద్దలు, పూజారులు, ప్రింటింగ్ ప్రెస్, ఫంక్షన్ హాల్ యజమాని తదితర భాగస్వాములైన ప్రతి ఒక్కరి పై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో బాల్యవివాహాలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తో కలిసి జిల్లా స్థాయి బాలల పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఒక్కబాల్య వివాహం కూడా జరగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బందితో పాటు పోలీస్ అధికారులు, విద్యా, వైద్యం, సంక్షేమ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతినెల ప్రతి మండలము గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాలు పకడ్బందీగా నిర్వహించాలని అందులో పూజారులను, కుల పెద్దలను, ప్రజలను పిలిపించి బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలను వివరంగా చెప్పాలని, ఒక వేళ బాల్య వివాహాలు చేస్తే కేసు పెట్టీ తీసుకునే తదుపరి చర్యల పై అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అంగన్ వాడి కార్యకర్తలు, సూపర్వైజర్లు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పోలీస్,ఉపాధ్యాయులు, రెవెన్యూ తదితర సిబ్బంది బాల్య వివాహాలు అరికట్టడానికి కలిసికట్టుగా పనిచేస్తే ఫలితాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా బడి మానేసిన అమ్మాయిలను గుర్తించాలని వారితో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తప్పకుండా మాట్లాడి తిరిగి విద్యాలయాల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. బాల్య వివాహానికి సహకరించే ప్రతి ఒక్కరి పై కేసు నమోదు చేయడం జరుగుతుందనీ వారిని బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు. మధ్యలో చదువు మానేసిన ప్రతి అమ్మాయిని గుర్తించి వారిని కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి విద్యాలయాల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 36బాల్య వివాహాలు జరుగకుండా ఆపి బాధ్యుల పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీఎస్పీ వెంకటేశ్వర రావు, పిడి డీఆర్డీఓ ఉమా దేవి, డిసిపిఓ రాంబాబు, జిల్లా అధికారులు, సిఐ లు , సి.డి.పి.ఒ లు, సూపర్వైజర్లు, స్వచ్ఛంద సంస్థ నుండి చిన్నమ్మ థామస్, మహిళా సంఘాల అధ్యక్షులు స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## 30న విద్యాసంస్థల బందును విజయవంతం చేద్దాం

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్**

**నారాయణపేట టౌన్, అక్టోబరు28 ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల మొత్తాన్ని విడుదల చేయాలని కోరుతూ అక్టోబరు 30న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు బంద్‌లో భాగంగా మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలో వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఈ బంద్ రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలలు, యూనివర్సిటీలకు వర్తిస్తుందన్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని, విద్యార్థులు బందులో అధిక సంఖ్యలోపాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరించినవారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉన్నారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

**చిన్నంబావి, అక్టోబరు28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో నూతనరోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు అయ్యాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు కృషితో చిన్నంబావి మండల పరిధిలోని నూతన రహదారులకు వెలుగొండ నుండి వయా బెక్కెం పెద్దదగడ వరకు 24 కోట్ల 90 లక్షలు, చిన్నంబావి నుండి చెల్లెపాడు వరకు రూ.39 కోట్లతో డబుల్‌రోడ్‌కు నిధులు మంజూరు చేయించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. చిన్నంబావి మండల ప్రజలు నాయకులు కార్యకర్తలు జూపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులు పత్తి అమ్మకాల కోసం సిసిఐని ఆశ్రయించాలి

**ఉప్పునుంతల,అక్టోబరు28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సిసిఐ సంస్థ 2025-26 పత్తి సీజన్‌కు సంబంధించిన పత్తి మార్కెటింగ్ విభాగం ధరలను ప్రకటించింది. ఈ ఏడాది రైతులకు కనీస మద్దతు ధర కింద పత్తి క్వింటాల్‌కు గరిష్టంగా 8110, కనిష్టంగా 8010 వరకు ధరలను నిర్ధారించారు. సిసిఐ ప్రకటన ప్రకారం, బీబీ రకానికి 8110, బీబీ స్పెషల్ రకానికి 8060, రకానికి 8010గా ప్రామాణిక ధరలు నిర్ణయించారు. అయితే 8శాతం నుంచి 12శాతం వరకు తేమశాతాన్ని బట్టి ధరలో వ్యత్యాసాలు ఉండవచ్చునని, పత్తి కొనుగోళ్లలో పారదర్శకత కోసం రైతులు ఆధార్‌లింక్ చేయడం తప్పనిసరి అని అధికారులు వెల్లడించారు. రైతులు ఓటిపి ద్వారా ఆధార్ ధృవీకరణ పూర్తి చేసుకోవాలని సూచించారు. అదనంగా,కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్మార్ట్ బ్యాంకింగ్ ఖాతాను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి యాక్టివ్ చేసుకోవచ్చని వివరించారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో తప్పనిసరిగా లింక్ చేసుకోవడంవల్ల నేరుగా డబ్బులు జమ అవుతాయని సిసిఐ అధికారులు పేర్కొన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినటోల్‌ఫ్రీ నంబర్ 18005995779 లేదా వాట్సాప్ హెల్ప్‌లైన్ 8897281111 ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం పత్తి రైతులకు పారదర్శక ధరలు, సురక్షిత చెల్లింపులు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ పత్తి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పత్తి రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## మధ్యాహ్న భోజనం వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలి



**నారాయణ పేట,అక్టోబరు 28 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్‌లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట పాత్రలను మంగళవారం వంట కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అందించిన వంట పాత్రలను ప్రతిరోజూ శుభ్రంగా కడిగి ఉపయోగించాలని సూచించారు. విద్యార్థులకు వండే ఆహారం నాణ్యతగా ఉండేందుకు బియ్యం కూరగాయలను శుభ్రంగా కడిగి మెనూ ప్రకారం ప్రతిరోజూ ఆహారం వండాలని ఆమెవంట కార్మికులను ఆదేశించారు. ఆహార పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే విద్యార్థుల ఆరోగ్యం మెరుగు పడుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్.భాను, ప్రకాష్, లక్ష్మణ్, నరసింహ, శిరీష, వంట కార్మికులు కృష్ణవేణి, ఇందిరమ్మ, వెంకటమ్మ, మేఘన పాల్గొన్నారు.

## నేడు చేప పిల్లల పంపిణీ

**దామరగిద్ద, అక్టోబరు28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి 100సబ్సిడీతో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నేడు ఉదయం 11:00 గంటల నుంచి దామరగిద్ద మండలంలో గల గ్రామాలైన ఆశన్ పల్లి ఊర చెరువు, లక్ష్మిపూర్‌నాగమ్మ చెరువు, పీడంపల్లి పార్ల చెరువు, చాకలిలోనిపల్లి ఊర చెరువు, లోకుర్తి ఊర చెరువు, మల్రెడ్డిపల్లి దేశాయ్ చెరువు, దామరగిద్ద నాగమ్మ చెరువులో చేప పిల్లలు పంపిణీ కార్యక్రమం ఉంటుంది. సంఘ సభ్యులు, మత్స్యకారులు తప్పకుండా హాజరు కావాల్సిందిగా జిల్లా మత్స్యశాఖ అధికారి కోరారు.

## పత్తిని ఆరబెట్టి విక్రయాలకు తీసుకురండి

**పేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి**

**నారాయణపేట టౌన్, అక్టోబరు28 ప్రభాతవార్త:** పత్తి అమ్మడానికి తీసుకువచ్చే రైతులు తడిస్తే తేకండి కనీసం మాయిశ్చర్ తేమశాతం 8 నుండి 12 మధ్యలో ఉంటేనే తీసుకురండి అని వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ వానలు, చలితో పత్తిలో తేమ శాతం 20 పైగా వస్తుందన్నారు. మాయిశ్చర్ 8శాతం ఉంటేనే మద్దతు ధరరూ.8110 ఇస్తామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. తేమ 12 శాతం మించకుండా ఉంటేనే కొంటామని చెబుతున్నారు. రైతులు పత్తి ఏరిన తర్వాత అరపెట్టి తీసుకొని రండి. వడ్ల కొనుగోళ్లలోనూ తేమ శాతం ఎక్కువ వస్తుంది. రైతులు అమ్మడానికి తెచ్చి ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఎఫ్‌సిఐ నిబంధనల ప్రకారం వడ్లు 17శాతం లోపు తేమ ఉంటేనే ఖరీదు చేస్తారు. పత్తిలో తేమ ఎక్కువ ఉన్న అమ్మ డానికి తెచ్చి ఇప్పటికే రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు అన్నారు. మన నారాయణపేట జిల్లాలో కూడా తుఫాన్ ప్రభావం ఐదు రోజులు ఉందని వాతావరణ కేంద్రంహెచ్చరించింది. రైతులు భయ భ్రాంతులు చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. రైతులు అమ్మడానికి తెచ్చి ఇబ్బందులు పడకుండా వర్షాలు తగ్గుముఖం పడ్డాక పత్తిని అరబెట్టి తీసుకుని రావాలన్నారు.

## తిరుమల్ రెడ్డి మృతదేహానికి మంత్రి జూపల్లి నివాళి

**చిన్నంబావి, అక్టోబరు 28 ప్రభాతవార్త :** చిన్నంబావి మండలం చిన్నమారురు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ గిరెడ్డిజ్యోతి భర్త తిరుమల్‌రెడ్డి గుండె పోటుతో సోమవారం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు చిన్నమారురు గ్రామానికి విచ్చేసి మృతుడు తిరుమల్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేశారు. వారి ఇద్దరి ఆడపిల్లల చదువుకు పూర్తి సహకారం చేస్తానన్నారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి అండగా ఉంటానన్నారు. అలాగే స్వగ్రామం పెద్దదగడ గ్రామంలో గత పది రోజులక్రితం చనిపోయిన కుటుంబాలను పరామర్శించారు. జింకల తిరుపతమ్మ, జింకల వెంకటమ్మ కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నాయకులుపాల్గొని నివాళులర్పించారు.



తిరుమల్ రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

# అంతరాలు లేని సమాజం కోసం విద్యార్థులు పోరాడాలి

◆ పిడిఎస్‌యు విద్యార్థుల బహిరంగ సభలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ॥ చింతకింది ఖాసీం

**వనపర్తి, అక్టోబరు28 ప్రభాతవార్త:** సమాజంలో కుల మత ఆర్థిక అసమానతలు లేని సమ సమాజం కోసం విద్యార్థులు పోరాడాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాసిం విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్ లో రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి అధ్యక్షతన పిడిఎస్‌యు తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభల సందర్భంగా మొదటి రోజు నిర్వహించిన విద్యార్థుల బహిరంగ సభలో ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా జార్జి రెడ్డి నాయకత్వంలో సాయుధ రైతాంగ పోరాటాల స్ఫూర్తితో 1974లో ఏర్పడ్డ శిదీలీగీ విద్యార్థి సంస్థ విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారంతోపాటు విద్య ప్రైవేటీకరణకు, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా చారిత్రాత్మక ఉద్యమాలను నిర్మించిందని కొనియాడారు. అదేవిధంగా విద్యారంగంలో వస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణల సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపే విధంగా విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలని తెలిపారు. అందరికీ ఉచిత సమానమైన విద్యాసాధన కోసం ఎందరో విద్యార్థి వీరులు తమ ప్రాణ త్యాగం చేశారని వారి పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థులకు ఆదర్శనీయమని అన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజ గమనాన్ని అధ్యయనం చేయాలని సమాజంలో ఉన్నటువంటి మూఢ విశ్వాసాలను, ప్రజల మధ్య వైషమ్యాలను పెంచే కులమత రాజకీయాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థులు పెంపొందించుకోవాలని కోరారు. అదేవిధంగాపాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ పిడిఎస్ రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు ఏం రాఘవచారి మాట్లాడుతూ విద్యను మరింత వ్యాపారమయంగా మార్చడానికి డబ్ల్యూటీవో గాట్స్ ఒప్పందాల అమలుకు ప్రపంచ బ్యాంకు భారత పాలక వర్గాలపై తీవ్రమైన ఒత్తిడిని తీసుకొస్తున్నదని అందువల్లనే దేశంలోకి విచ్చలవిడిగా విదేశీ కార్పొరేట్ యూనివర్సిటీలకు గేట్లు బార్ల తెరుస్తున్నారని ఇది దేశంలోనే అణగారిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రలో భాగమేనని అన్నారు. భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల వల్ల ప్రజల్లో తీవ్రమైన ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని దేశంలోని 80 శాతం సంపద కేవలం ఇద్దరు బడా పెట్టుబడుదారుల చేతుల్లో ఉందని ఇది కార్పొరేట్లకు సేవచేసే ప్రభుత్వాల విధానాలను బట్టబయలు చేస్తున్నదని విమర్శించారు. దేశంలో కోట్లాదిమంది యువత నిరుద్యోగితతో కొట్టుమిట్టాడుతున్నదని ఉద్యోగఉపాధి అవకాశాలు లేక మద్యం, డ్రగ్స్‌కి బానిసలుఅవుతూ యువశక్తి నిర్వీర్యంఅవుతున్నదని పాలకవర్గాలు కూడా వీటిని కట్టడి చేయడంలో విఫలం అవుతున్నాయని అన్నారు. ఈ బహిరంగసభలో పిడిఎస్యు జాతీయ నాయకులు ఇ.విజయ్ కన్నా, పిడిఎస్యు మాజీ నాయకులు కవి జనజ్వాల, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.భాస్కర్, పిఒడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలుఎం.సరళ, ఆంధ్ర ప్రదేశ్ పిడిఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండి రఫీ,ఎస్.కిరణ్ కుమార్‌లో ప్రసంగించారు.అదేవిధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కే.పవన్ కుమార్ అదేవిధంగా రాష్ట్ర నాయకులు రంజిత్ సతీష్ గణేష్ జై గణేష్‌లు కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ చింతకింది ఖాసీం, సంఘ అధ్యక్షులు ఏం. రాఘవచారి, పిడిఎస్‌యు మహాసభకు హాజరైన విద్యార్థులు

## విజిలెన్స్ అవగాహన వారోత్సవం




పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, అక్టోబరు 28 ప్రభాతవార్త:** ప్రతి ఉద్యోగి నిజాయితీగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ప్రభుత్వ శాఖ ద్వారా చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు ఎటువంటి లోపం లేకుండా బాధ్యతతో, అవినీతి రహితంగా,పారదర్శకంగా అందించాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్టోబర్ 27 నుండి నవంబర్2 వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. "విజిలెన్స్ అందరి బాధ్యత" అనేది ఉద్యోగుల గుర్తించాలి అన్నారు. జిల్లా కేంద్రం నుండి గ్రామం వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి మంచి సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో విధినిర్వహణలో నిజాయితీతో కూడిన సేవలను అందించడం, పారదర్శకతను పాటించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం, ప్రభుత్వ సహాయం కోసం వచ్చే వారి హక్కులను కాపాడుతూ, న్యాయ సూత్రాలకు అనుగుణంగా సేవలను అందించడానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డి.ఆనంద్ కుమార్, ప్రాంతీయ విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ అధికారి, హైద్రాబాద్ సిటీ 2 యూనిట్, విజిలెన్స్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్‌డిఓ నవీన్, విజిలెన్స్ తహశీల్దార్ రాజశేఖర్, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవిఎంల స్ట్రాంగ్ రూమ్ దగ్గర భద్రత పటిష్టంగా వుండాలి : కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల టౌన్ అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ఈ.వీ.ఎం.లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్ పాల్గొన్నారు.

## బనద యల్లమ్మ దేవి శిలా మందిర నిర్మాణానికి పూజ కార్యక్రమం

**నారాయణ పేట, అక్టోబరు 28 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా క్రిష్ణ మండలం కున్సీలో నేడు ఉదయం 9గంటలకు బనద యల్లమ్మ దేవి నూతనశిలా మందిరం నిర్మాణానికి అంకురార్పణ శిలా పూజ కార్యక్రమం బిజ్వార్ ఆదిత్య పరశ్రీ స్వామి చేతుల మీదుగా నిర్వహించడం జరుగుతుంది.మందిర నిర్మాణం కృష్ణశిలాలతో 18స్తంభాలు రూపొందించి భవ్యమైన మందిరాన్ని నిర్మించేందుకు ఇప్పటికే దేవాలయప్రధాన అర్చకులు పూజారి శరణప్ప ఆధ్వర్యంలో భక్తులందరు తను మన ధన సహాయం తో గ్రామ పుర ప్రముఖులకు సహకరించి మార్గదర్శి కన్సల్టేన్సీ ఉడుపి వారికిఇచ్చినందున ఈ పనులు నేటి నుండి ప్రారంభం కాబోతు న్నాయి. మహారాష్ట్ర,కర్ణాటక అన్ని గ్రామలా ప్రజలు, పెద్దలు, భక్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని తెలిపారు.

## గురుకులంలో సూసైడ్ నోట్ కలకలం

- అమ్మ నాన్న నన్ను క్షమించండి అంటూ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్28 ప్రభాతవార్త:** అమ్మ నన్ను క్షమించండి అంటూ ఓ విద్యార్థిని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో చోటు చేసు కుంది. వివరాల్లోకి వెళితే కొల్లాపూర్ మండలనికి చెందిన విద్యార్థి (21) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యనభ్య సిస్తుంది. మంగళవారం వసతి గృహంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిం చింది. తోటి స్నేహితులు గమనించి వసతి గృహ వార్డెన్,సిబ్బందికి సమాచారాన్ని అందించారు.వెంటనే చికిత్స నిమిత్తం విద్యార్థినిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

## రైతులు సేంద్రియ వ్యవసాయం అభివృద్ధి చేయాలి

**నారాయణ పేట, అక్టోబరు 28 ప్రభాతవార్త:** నారాయణపేటలో పట్టణ కేంద్రం జరిగిన శ్రీమద్ భగవద్గీత ప్రవచన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా భారత్ అన్న శుద్ధి పాదయాత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు త్యాగి హాజరయ్యారు. ఆయన ప్రవచనకర్త దామరగిద్ద రవీంద్రనాథ్‌ని స్వహస్తాలతో సన్మానించి కార్యక్రమాన్ని ప్రశంసించారు.జంక్‌ఫుడ్ వినియోగంరసాయన ఎరువుల వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి డా.కె జయచంద్రమోహన్ ఆరోగ్యకరమైన ఆహారం అలవాటు చేసుకోవాలని సూచించగా డా.సాయిబాబా ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలని అన్నారు. రఘువీర్ యాదవ్ మంచి ఆహారంతో పాటు మంచి నీరు తీసుకోవడం సర్వరోగ నివారిణి అని చెప్పారు. మాజీ కౌన్సిలర్ సూర్యకాంత్, నిర్వాహకులు వింజమూర్ జగదీష్, బాలాజీ గౌడ్, కలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ముగింపులో విశిష్ట, ముఖ్య అతిథులను శాలువాలతో సన్మానించారు.

## ఆరు గ్యారంటీలను గాలికొదిలేసిన సీఎం

మొదటి పేజీ తరువాయి భాగం..

ఎమ్మెల్సీ కవిత సమాధానాలిస్తూ 42శాతం బీసీ రిజర్వేషన్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని ఇటీవలరాష్ట్రంలో నిర్వహించిన బీసీబంద్‌లో కాంగ్రెస్,బీజేపీలు పాల్గొనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.ఈ పార్టీల నాయకులు బీసీలపై ప్రేముంటే పార్లమెంట్‌లో బీసీల బిల్లు పాస్ చేయించాలని లేనిపక్షంలోవారు తమ పదవులకు రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆయా పార్టీలు బీసీలపై ప్రదర్శించే కపటప్రేమను మానుకోవాలని హితవు చెప్పారు.

## త్వరలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారు

■ ఉనికిని కాపాడుకునేందుకు ధర్నాలు ■ స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ఓటమి తప్పదు : పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, అక్టోబరు28 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలో సోమవారం రోజు బిఆర్ఎస్ నాయకులు పట్టణ అభివృద్ధి పనులు చేపట్టాలని చేసిన ధర్నాకు కౌంటర్ గా మంగళవారం రోజు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించి బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు ధర్నాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తోందని పెబ్బేరు కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఇటీవల మున్సిపల్ అధికారులు,పెబ్బేరు కాంగ్రెస్ నాయకులతో భేటీ అయిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఈ నెల 29 నుంచి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తారని ప్రకటించడంతో ఎక్కడ తమ ఉనికి పోతుందోనన్న భయంతో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారని మండిపడ్డారు. రోడ్డు విస్తరణ పనులు బీఆర్ఎస్ పాలకవర్గం ఉన్న సమయంలోనే ప్రారంభమయ్యాయి. నిధులు ఉండి,టెండర్ల ప్రకియ పూర్తయినా రోడ్డునిర్మాణం చేపట్టలేకపోయారని అన్నారు. బాధితుల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూలగొట్టారు.. రహదారి విస్తరణకు అడ్డుగా తమ పార్టీ వాళ్ల ఇళ్లను మాత్రం తొలగించలేక కాంగ్రెస్ ప్రభుత్వంపై,ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై దుమ్మెత్తి పోస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో పెబ్బేరుకు 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయించలేక పోయారని వాపోయారు. మేఘారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన సంవత్సరంలోపే పెబ్బేరుకు 30 పడకల ఆసుపత్రినిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలకవర్గం మున్సిపాలిటీలో మిగులుగా ఉన్నరూ.4 కోట్లను దుర్వినియోగం చేసి స్వప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే చేయనంతగా వనపర్తిని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుంటే బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధికి సహకరించాల్సింది పోయి అడ్డు పడుతున్నారని వాపోయారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు తోమాలపల్లి వద్ద స్థలంకేటాయించి నిర్మాణానికి పూనుకున్నారని చెప్పారు. అదేవిధంగా పట్టణశివారులోని సర్వే నం.162లో మహిళా సంఘాల ఆధ్వర్యంలోత్వరలోనే పెట్రోల్‌బంకును ప్రారంభించనున్నారని అన్నారు. పెబ్బేరు పట్టణ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులను విడుదల చేశారని, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ కోసం ఆ నిధులను వినియోగించనున్నారని చెప్పారు. ఇవన్నీ చేస్తుంటే పెబ్బేరు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానిక ఎన్నికల స్టంట్ల కోసం బీఆర్ఎస్ నాయకులు రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేయడం సిగ్గు చేటుగా ఉందని విమర్శించారు. ప్రజలు నవ్వుతున్నారని వారి ధోరణిని మార్చుకోవాలని హెచ్చరిక చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,టౌన్ అధ్యక్షుడు వెంకట్రాములు, నాయకులు యుగంధర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు

## రోడ్లపై కూరగాయలు అమ్మవద్దు

◆ ట్రాఫిక్ అంతరాయం కలిగించకూడదు ◆ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు : మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

**నారాయణపేట టౌన్, అక్టోబరు28 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని చికెన్, మటన్, చేపల మార్కెట్‌ను మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేకలు, గొర్రెలను జంతు వధశాలలోనే వాదించాలని ఇళ్లల్లో ఎవరు వధించకూడదని ఆదేశాలు తయారు చేశారు. మాంసపు వ్యర్థాలు, చేపల వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా పురపాలక సంఘానికి చెందిన పారిశుధ్య ఆటో, ట్రాక్టర్‌లోనే వేయాలని ఆదేశించారు. ఆదేశాలు ఎవరు ఉల్లంఘించిన చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కూరగాయల మార్కెట్‌ను సైతం సందర్శించి రోడ్లపై ఎవరు కూరగాయలు అమ్మవద్దని ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందన్నారు. మార్కెట్ సముదాయంలోనే షెడ్డులోనే కూరగాయలు అమ్మాలని సూచించారు. కమిషనర్ వెంట సిబ్బందితోపాటు తదితరులు ఉన్నారు.



మార్కెట్ సముదాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మాంసం, చేపల మార్కెట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

## కాంగ్రెస్ హయాంలో నిలిచిన ప్రాజెక్టు పనులు

◆ 80 శాతం పూర్తయిన పాలమూరు ప్రాజెక్ట్ పనులు
◆ రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలి
◆ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి డిసెంబర్ 9 హామీని నిలబెట్టుకోవాలి
◆ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత
◆ జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా పాలమూరులో పర్యటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు నిలిచిపోయాయని, 80శాతం పూర్తైన ఉదండాపూర్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తారో లేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు.మంగళవారం జాగృతి జనంబాట కార్యక్రమం పాలమూరు జిల్లాలో భాగంగా జడ్చర్ల మండల పరిధిలోని ఉదండాపూర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత రైతులకు పరిహారం చెల్లింపులు అన్ని పార్టీలు విఫలమయ్యాయని మానవత దృక్పథంతో భూ నిర్వాసితుల ప్యాకేజీ పెంపు పై రాష్ట్ర ప్రభుత్వంపునరాలోచించాలని పేర్కొన్నారు. ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే తాము నష్టపోయినా సరే కానీ ఉమ్మడి పాలమూరు జిల్లా రంగారెడ్డి జిల్లా రైతులు బాగుపడతారని ఆలోచించి ఉదార స్వభావంతో భూములు ఇచ్చారు. అయితే ఇక్కడి రైతులను ఆదుకోవడంలో మాత్రం అన్ని పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని కవిత ఆరోపించారు.

**పాలమూరు ప్రాజెక్టు పనులు ఆపి నారాయణపేట, కొడంగల్‌కు నిధులు..**

గత ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు 80% పూర్తయ్యాయని.. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాగానే పనులు పూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. ఇక్కడ పనులు ఆపేసి నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టులను ప్రారంభించారని ఇక్కడ 10శాతం డబ్బులు కేటాయిస్తే ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావడంతోపాటు ఉమ్మడిపాలమూరు జిల్లా భూముల సాగుకు నీరు అందేవని తెలిపారు.భూ నిర్వాసితుల చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కరించడంలో ప్రభుత్వం వెనుకాడడం సరైన పద్ధతి కాదన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ఏ సమయంలో ఇస్తారో ఆ సమయంలో ఉన్న భూముల ధరల ఆధారంగా వారికి డబ్బులు చెల్లించాలని ఈ విషయమై ప్రభుత్వం మానవత దృక్పథంతో ఆలోచించి పరిహారం చెల్లించాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణానికి భూములు అప్పగించని వేలఎకరాల విషయంలో కూడా ప్రభుత్వం చొరవ తీసుకొని వారికి తగిన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి డిసెంబర్ 9లోగా రూ. 25 లక్షల పరిహారంఅందేలా చూస్తానని ఇచ్చినహామీని నిలబెట్టుకోవాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే గడుపులోగా హామీని నిలబెట్టుకోకపోతే అప్పుడు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని ఆమె తెలిపారు.దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంబడే అమలు చేస్తామని ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుకోవాలని, తులం బంగారం,4వేల పెన్షన్ అందించాలనిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా యూత్ అధ్యక్షుడు ఎల్లయ్య యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్, ఉదండాపూర్ భూ నిర్వాసితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

## ఘనంగా కార్తీక దీపోత్సవం

కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి దంపతులు

**మక్తల్ టౌన్, అక్టోబరు 28 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో కార్తీక సందర్భంగా పాడి పరిశ్రమలు యువజన శాఖమంత్రి వాకిటి శ్రీహరి సతీసమేతంగా వచ్చి బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో శ్రీ పడమటి ఆంజనేయస్వామి రామ్ లీలా మైదానంలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీకదీపం స్వయంగా వెలిగించి కార్తీకదీపం ఉత్సవ విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. కార్తీక మాసం అత్యంత విశిష్టమైన మాసమని రైతులందరూ అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉంటూ ప్రకృతి సహజసిద్ధంగా సకాలంలో వర్షాలు కురుస్తూ ప్రకృతి మనకు ఎల్లవేళలా సహకరిస్తుందని తెలియజేశారు. సకల సమాజాన్ని భక్తి మార్గం వైపు తీసుకుపోయే మాసం కార్తీకమాసం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ బ్రహ్మకుమారీలు, మార్కెట్ వైస్ చైర్మన్ బి.గణేష్, మాజీ జడ్పిటిసి సి.లక్ష్మారెడ్డి, పుర ప్రముఖులు, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

బాలాజి ఇండస్ట్రీస్ కాటన్ జిన్నింగ్ మిల్లును ఆమె సందర్శించారు. పత్తి రైతులతో కలెక్టర్ మట్లాడుతూ తమ పత్తిని కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్కింగ్ చేసుకొని వస్తే సిసిఐ పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు.పత్తిని ఆరబెట్టుకొని తీసుకొని వస్తే, తేమ శాతం 8 నుండి 12 శాతం ఉంటే మద్దతు ధరల లభిస్తుందని తెలిపారు. రైతులు తెచ్చిన పత్తిని తేమ శాతం పరిశీలించేటప్పుడు ఒకటికి నాలుగు సార్లు పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా సిసిఐ కొనుగోళ్ళు జరగాలని సూచించారు.మొంథా తుఫాన్ కారణంగా రేపు, ఎల్లుండి వర్షంపడే అవకాశం వున్నందున రైతులు కొనుగోలు కేంద్రానికి వచ్చేటప్పుడు తమ సరుకులను ఆరబెట్టుకొని తీసుకు రావాలని లేనిచో మద్దతు ధర లభించదని సూచించారు.

## పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం ప్రణాళిక సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక సదుపాయాల లోటు మత్స్య, పాల ఉత్పాదకత స్థాయి నేల ఆరోగ్యం వంటి అంశాలు ఉండాలని తెలిపారు. సర్వే ఆధారంగా యాక్షన్ ప్లాన్ రూపొందించి ఐదు సంవత్సరాల ఫలిత ఆధారిత లక్ష్యాలను నిర్ణయించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ వాతావరణానికి అనుగుణంగా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులు శాఖలతో ప్రస్తుత పథకాల అమలు స్థితిని సమీక్షించారు.రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా పథకం అమలుకు వేగం పెరుగుతుందని తెలిపారు. రెండు రోజుల్లో బేస్‌లైన్ సర్వేతో కూడిన ప్రణాళికనుసిద్ధం చేసిదానిపై డాక్యుమెంటరీ రూపొందించాలనిఆయన ఆదేశించారు. నోడల్ అధికారి సాయిబాబా, డీఆర్డీఓ మొగులప్ప, జాన్ సుధాకర్, రహమాన్, షణ్ముఖ చారి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవనంలోకి డయాలసిస్ విభాగం

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించి వేగంగా వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. ఎంసీహెచ్ తోపాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో త్వరితగతిన ఆక్సిజన్‌వెంటిలేటర్ సదుపాయాన్ని వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ విభాగం మొదటి అంతస్తులో ఉన్నందున రోగులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి నవంబర్ 1 నాటికి జీజీహెచ్‌లో ఉన్న డయాలసిస్ విభాగాన్ని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనంలోకి తరలించేందుకు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. టీహబ్‌లో రిపేరుకు గురైన బయో కెమిస్ట్రీ యంత్రాన్ని వేగంగా మరమ్మతులు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని సూపరింటెంట్‌కు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, సూపరింటెండెంట్ రంగారావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సాయినాథ్‌రెడ్డి, పరిమళ,టిజిఎస్ఎంఐడిసి ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## రూ.10 కోట్లతో పూలే, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నించారని,ఇలాంటి మంచి వాతావరణంలో అత్యున్నతమైన ప్రదేశంలో అందరికీ ఉపయోగపడే విధంగా ఒక నాలెడ్జ్ సెంటర్ పెట్టాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని, అందుకు ఎంతో శ్రమించామని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఇప్పటివరకు ఎన్నో శంకుస్థాపనలు చేయడం జరిగిందని, కానీ ఈరోజు శంకుస్థాపన చేసినంత ఆనందం ఇప్పటి వరకు తనకు ఎప్పుడుకలగలేదని అన్నారు.పూలే ఆదర్శ దంపతులను, రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంగా నామకరణం చేయడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక తరగతులు నిర్వహించుట కోసం హాల్స్ నిర్మాణం చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు వసంత, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమరేందర్ రాజు, సిజే బెనహర్, శ్రీనివాస్ యాదవ్, నవనీత,ఫయాజ్, పీర్‌మహ్మద్ సాదిక్,చర్ల శ్రీనివాసులు, జహీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థికి మన్నె జీవన్‌రెడ్డి చేయూత

రూ.లక్షా 35వేల ఆర్థిక సాయం అందించిన మాజీ టీటీడీ బోర్డు సభ్యులు

**మహబూబ్‌నగర్, అక్టోబరు28 ప్రభాతవార్త:** నిరుపేద వైద్య విద్యార్థికి పాలమూరు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మన్నె జీవన్‌రెడ్డి ఆర్థికంగా అండగా నిలిచారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్ పల్లి తండాకు చెందిన కడావత్ రాజేశ్వరి ఎంతో కష్టపడి చదివి డా. పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ లో సీటు సాధించింది. ఆమె కుటుంబం ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న దృష్ట్యా కాంగ్రెస్ నాయకులు మన్నె జీవన్ రెడ్డి ఆర్థికంగా చేయూత అందించారు. కళాశాల ఫీజు రూ. లక్ష 35 వేల రూపాయలను ఆన్‌లైన్‌లో విద్యార్థికి పంపించారు. ఈ సందర్భంగా మన్నె జీవన్ రెడ్డికి రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.గతంలో మన్నెజీవన్‌రెడ్డి ఎంతోమందికి వైద్య చికిత్సల కోసం, విద్యార్థుల ఫీజుల కోసం ఆర్థిక సాయం అందజేశారు.



## గోవిందా..గోవిందా

(మొదటి పేజీ తరువాయి)

భక్త జనసంద్రంగా మారింది.. స్వామివారికి కొత్త మట్టి కుండలో పచ్చిపులుసు, పరమాన్నంతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి భక్తులు తలనీలాలు సమర్పించి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లకుమొక్కులు చెల్లించుకున్నారు.

**బండెనుక బండి కట్టి:** శ్రీ కురుమూర్తి స్వామి జాతర పల్లె జాతంగా పేరుగాంచింది. పల్లె ప్రాంత ప్రజలుశ్రీ వెంకటేశ్వరుడి ప్రతిరూపంగా శ్రీ కురుమూర్తి స్వామిని కొలుస్తారు. ఉద్దాల మహోత్సవం రోజున స్వామివారికి దాసంగాలతో నైవేద్యం సమర్పించేందుకుగాను పల్లె ప్రాంతాల నుంచి బండెనుక బండి కట్టి.. కురుమన్న జాతరకు వెళ్దాం పదాఅంటూ పల్లె ప్రజలు ఎడ్లబండ్లతో కురుమయ్య జాతరకు తరలివచ్చారు.

**గరుడ వాహనంపై ఊరేగిన కురుమూర్తి స్వామి..**

శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత కురుమూర్తి స్వామి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారి ప్రధానాలయంలో అందమైన పూలతో అలంకరించిన పల్లకిలో స్వామివారిల ఉత్సవ విగ్రహాలను ఉంచి వేతపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి ప్రధానాలయం నుంచి స్వామి వారి పుష్కరిణి వరకు చిన్న చింతకుంట దాసులు పలకి సేవ మాడా వీధిలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణలతో కురుమతిగిరులు పులకరించాయి.